

ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ

అనంతపురం సిటీ : ఎమ్మెల్సీ ఎన్నికలు ఈనెల 13వ తేదీ జరగనున్న నేపథ్యంలో జెఎన్‌టియులోని స్ట్రాంగ్ రూము, కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్‌పి ఫక్కీరప్ప కాగినెల్లి శనివారం పరిశీలించారు. కౌంటింగు రోజున జేఎన్టీయూ వద్ద చేపట్టాల్సిన బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు తదితర చర్యలపై స్థానిక పోలీసు అధికారులకు ఆయన సూచనలు చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా జిల్లా యంత్రాంగంతో కలిసి చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రత, పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్ట్రాంగు రూముల వద్ద సాయుధ బలగాలచే గార్డు నిర్వహించాలని సూచించారు. స్ట్రాంగు రూం, కౌంటింగ్ కేంద్రాల పరిసరాలు కవర్ అయ్యేలా సిసి కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేయాలని అదేశించారు. కౌంటింగ్ రోజున అభ్యర్థులు, ఏజెంట్లు ఏమి చేయాలో, ఏమి చేయకూడదో వివరిస్తూ దిశానిర్ధేశం చేశారు.

మందులు లేవు..సిబ్బందీ లేరు..!



హిందూపురం పట్టణంలోని ఈఎస్‌ఐ ఆసుపత్రి

ఈఎస్‌ఐ ఆస్పత్రుల్లో మందుల కొరత ఏర్పడింది. ప్రభుత్వం పాత బకాయిలు చెల్లించకపోవడంతో మందులు సరఫరా చేయబోమని కంపెనీలు తెగేసి చెబుతున్నాయి. దీంతో అవసరమైన మందులు అందక కార్మికులు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. వ్యాధులు నయం చేసుకునేందుకు బయట మార్కెట్‌లో మందులు కొనుగోలు చేయాల్సిన దుస్థితి. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

250 రకాల మందులకు వచ్చింది 50 మాత్రమే
ఇండెంట్ పంపినా సరఫరా చేయని కాంట్రాక్టు కంపెనీలు
ఈఎస్‌ఐ ఆస్పత్రుల్లో ఇదీ దుస్థితి

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో హిందూపురంలో రెండు, అనంతపురం, గుంతకల్లు, తాడిపత్రిలో ఈఎస్‌ఐ ఆస్పత్రులు ఉన్నాయి. ఇక్కడ రోజూ సుమారు 500 మందికి పైగా కార్మికులు వైద్య సేవల కోసం వస్తుంటారు. అయితే జిల్లాలో ఎక్కడా లేని విధంగా హిందూపురం ఈఎస్‌ఐ అసుపత్రికి ఎక్కువ మంది రోగులు వస్తుంటారు. హిందూపురం ప్రాంతంలో దాదాపు 20 వేల మంది కార్మికులకు పైగా ఉన్నారు. ఒక్కో కుటుంబంలో నలుగురు సభ్యులను కలుపుకుంటే మొత్తం సభ్యుల సంఖ్య సుమారు 80 వేల వరకు ఉంటుంది. వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు ఆయా సంస్థలు తమ ఈఎస్‌ఐ వాటాను చెల్లిస్తాయి. దీంతో కార్మికుల కుటుంబ సభ్యులకు ఈఎస్‌ఐ డిస్పెన్సరీ, ప్యానెల్ క్లినిక్‌లో వైద్య సేవలు అందిస్తుంటారు. కడప కేంద్రంగానే కడప, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు, అనంతపురానికి చెందిన ఈఎస్‌ఐ జాయింట్ ప్రాంతీయ కార్యాలయం ఉంది. 28 డిస్పెన్సరీలు ఆదోని, తిరుపతిలో, నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో డయాగ్నోస్టిక్ సెంటర్లు ఉన్నాయి. వైద్యుల లెక్క ప్రకారం ఆస్పత్రులు, డిస్పెన్సరీలకు ఒక్కో దానికి రోజుకు 100 నుంచి 150 మంది ఈఎస్‌ఐ కార్డు కలిగిన కార్మికులు చికిత్స కోసం వస్తుంటారు. డిస్పెన్సరీలకు అవసరమైన మందుల ఇండెంట్‌ను కడప జేడీ కార్యాలయం నుంచే విజయవాడ కార్యాలయానికి పంపిస్తుంటారు. ఏయే మందులు అవసరమో వాటిని అక్కడి నుంచి డిస్పెన్సరీలకు సరఫరా చేస్తారు. సమస్యలను పరిష్కారించాలని డిమెండ్ చేస్తూ సిపిఎం, సిఐటియు నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. అయినప్పటికి అధికారుల్లో చలనం లేదు. దీంతో సమస్యను ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్‌ను కలిసి వివరించారు. స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

మందుల కొరత..

ప్రభుత్వం మందులు సరఫరా చేసే కంపెనీలకు బకాయిలు చెల్లించడం లేదు. దీంతో కంపెనీలు ఈఎస్‌ఐ ఆస్పత్రులకు అవసరమైన మందులను సరఫరా చేయడం లేదు. మూడు నెలలకు ఓ సారి ఆస్పత్రులకు అవసరమైన మందుల ఇండెంట్‌ను జేడీ ద్వారా విజయవాడలోని డైరెక్టర్‌కు పంపిస్తుంటారు. 250 రకాల మందులను డాక్టర్లు ఇండెంట్ పెడుతుంటారు. దీర్ఘకాలిక వ్యాధుల మందులతో పాటు బీపీ, షుగర్, లివర్, కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి మందులు తెప్పిస్తుంటారు. అయితే ప్రభుత్వం కంపెనీలకు పాత బకాయిలు ఇవ్వకపోవడంతో మందుల సరఫరా నిలిచిపోయింది. 250 రకాల మందులకు గాను ఇప్పుడు కేవలం 50 రకాలు మాత్రమే వస్తున్నాయి. కార్మికులు నిత్యం వాడే బిపి, షుగర్, థైరాయిడ్ లాంటి రోగాలకు సైతం పూర్తి స్థాయిలో మందులు రావడం లేదు.

కార్మికులకు భారంగా..

చాలా మంది కార్మికులు అరకొర జీతాలు, సంపాదనతోనే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఏదైనా జబ్బుచేస్తే ఈఎస్‌ఐ కార్డుతో చికిత్స చేయించుకోవచ్చనే భరోసా కార్మిక కుటుంబాలకు ఉంటుంది. కార్మికులతో పాటు వారి పిల్లలు, తల్లిదండ్రులకు ఉపయోగంగా ఉండేది. అయితే ఈఎస్‌ఐ డిస్పెన్సరీలో కూడా మందుల కొరత ఉండడం కార్మికులను కలవరపాటుకు గురిచేస్తోంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు మందులు ఇంజెక్షన్ల కోసం సుమారు రూ.2 నుంచి రూ.3 వేల విలువజేసే మందులను ఉపయోగిస్తుంటారు. వీరు క్రమం తప్పకుండా రోజూ మందులు వేసుకోవాల్సి ఉంది. అయితే ఇప్పుడు ఈఎస్‌ఐలో మందుల కొరత కారణంగా బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిరావడం కార్మికుల కుటుంబాలకు భారంగా మారుతోంది. ఇక్కడ సరైన వైద్యం అందక పోవడంతో ఇతర అసుపత్రుల్లో వైద్య సేవలు పొందితే దానికి సంబంధించిన బిల్లులు ఆరు నెలలు గడిచినా మంజూరుకావడం లేదు. ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ అసుపత్రుల్లో ఈఎస్‌ఐ కార్డు ఉన్న వారికి వైద్య సేవలు అందించలేమని తెగేసి చెబుతున్నట్లు కార్మికులు పేర్కొంటున్నారు. దీనికి కారణం ఈఎస్‌ఐ వైద్య సేవలకు సంబందించి సకాలంలో బిల్లులు మంజూరు కాక పోవడమే. ప్రతి నెలా కార్మికులు ఈఎస్‌ఐ కోసం డబ్బులు చెల్లించినప్పటికీ వైద్య సేవల కోసం అప్పులు చేసి మోయలేని భారాన్ని మోయాల్సి వస్తోంది.

మందులే కాదు..సిబ్బందీ లేరు..

హిందూపురం ఈఎస్‌ఐ అసుపత్రిలో మందుల కొరతే కాదు.. సిబ్బంది కొరతా వేదిస్తోంది. హిందూపురం, కొట్నూరుకు సంబంధించి రెండు డిస్పెన్సరీలనూ ఒకే చోట నిర్వహిస్తున్నారు. ఇద్దరు వైద్యులు ఉన్నప్పటికీ నర్సింగ్, ల్యాబ్ టెక్నీషియన్, ఎంఎన్ఒతో పాటు క్లాస్-4కు సంబంధించి అన్ని పోస్టులూ ఖాళీగా ఉన్నాయి. దీంతో పాటు కార్యాలయంలో ఉండాల్సి సీనియర్ అసిస్టెంట్లు సైతం లేరు. రోగులతో పాటు వైద్యులు కూడా ఇబ్బంది పడుతున్నారు.

సౌకర్యాలు మెరుగుపరచాలి..



జిల్లాలో కార్మికుల కోసం ఉండే ఒకే ఒక అసుపత్రి ఈఎస్‌ఐ హాస్పిటల్. ఈ అసుపత్రిలో మందులే కాదు.. సిబ్బంది కూడా లేకపోవడంతో కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదు. వెంటనే పూర్తి స్థాయి సిబ్బందిని నియమించి అవసరమైన మందులు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలి. అసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. లేని పక్షంలో కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం అవుతాం.

- ఈఎస్ వెంకటేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి,

8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం

హాజరు కానున్న కేరళ మాజీ ఆరోగ్య మంత్రి, ఐద్వా అఖిల భారత అధ్యక్షురాలు పికె.శ్రీమతి
సమానతను సాధించుకుందాం.. ఐక్య ఉద్యమాలను బలపరుద్దాం..
ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఈనెల 8వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి తెలిపారు. శనివారం గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కార్మికులకు 8 గంటల పని విధానం అమలు కోసం ఎందరో మహిళామణులు ప్రాణాలకు తెగించి పోరాడారని తెలిపారు. అశువులు బాసి పని గంటలు సాధించుకున్నారని అన్నారు. నాటి ధీర మహిళల పోరాట పటిమను స్ఫూర్తిగా పెంపొందించుకుని సమానత్వం సాధించుకోవడానికి ఐక్య ఉద్యమాలను బలపరచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఏటా మహిళా దినోత్సవం సందర్భంగా ఒక నినాదంతో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఏడాది కూడా సమానతను సాధించుకుందాం- ఐక్య ఉద్యమాలను బలపరుచుదాం అనే నినాదంతో మహిళా దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. సమాజంలో నేటికీ మహిళలు వివక్షకు, హింసలకు, హత్యలకు గురవుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. మహిళలను అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు మాత్రమే గౌరవిస్తే సరిపోదన్నారు. ఒక్క రోజు గౌరవించి మిగతా రోజుల్లో అగౌరవపరచడం కాదన్నారు. నిత్యం మహిళలను గౌరవించుకోవడంతోనే సమానత్వం, మంచి సమాజంగా విరజిల్లుతుందన్నారు. ప్రపంచీకరణ, కార్పొరేటీకరణ జరిగిన తరువాత కార్మికులకు 14 గంటల పని విధానం అమలు చేస్తున్నారని చెప్పారు. పని ఒత్తిడికి గురవుతూ ఉద్యోగాలు మానివేయడం, మానసిక క్షోభకు గురవుతూ ఆత్మహత్యలకు పాల్పడటం వంటివి చోటు చేసుకుంటున్నాయని అన్నారు. 8 గంటల పని విధానం అమలు కోసం ఐక్యంగా పోరాడాలని, హక్కుల సాధన కోసం కూడా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. అందరినీ ఐక్యం చేయడమే లక్ష్యంగా మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐద్వా, యుటిఎఫ్, సిఐటియు, ఎడబ్ల్యూడబ్ల్యూయు, ఆశా, ఎండిఎం, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యూయు సంఘాల ఆధ్వర్యంలో మార్చి 8వ తేదీన టిటిడి కల్యాణమండపంలో భారీ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా కేరళ రాష్ట్రం మాజీ ఎంపీ, మాజీ ఆరోగ్య శాఖ మంత్రి పికె.శ్రీమతి హాజరవుతున్నారని తెలిపారు. జిల్లాలోని రచయితలు, మేధావులు, కవులు, కళాకారులు, మహిళలు, ఉద్యోగులు, విద్యార్థినీ విద్యార్థులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఐద్వా నగర కార్యదర్శి చంద్రిక, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అర్బన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు జయభారతి, నాయకురాలు కాత్యాయని సెక్టోరియల్ నాయకులు యశోద, రామాంజినమ్మ, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేద్దాం

మార్చి 8వ తేదీన టిటిడి కల్యాణమండపంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి పిలుపునిచ్చారు. శనివారం ఇస్కాన్ వద్ద కాలనీలో మహిళలతో సమావేశం నిర్వహించారు. కార్మికులు, శ్రామికులకు 8 గంటల పని విధానం అమలు కోసం, హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడుదామన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి చంద్రిక, కాలనీలోని 300 మహిళలు పాల్గొన్నారు.

ఎగువ భద్రతో రాయలసీమ ఎడారే

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

కర్నాటక రాష్ట్రం తుంగభద్ర నది మీద ఎగువ భద్ర ప్రాజెక్టును నిర్మిస్తే దిగువ ప్రాంతమైన రాయలసీమ ఎడారి అవుతుందని మాజీ రాజ్యసభ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. తాడిపత్తి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తుంగభద్ర నది రాయలసీమకు జీవనాడి అన్నారు. తుంగభద్రా నదిలో ఏడాదికి 416 టిఎంసిల నికర జలాలు ఉంటాయని, బచావత్ ట్రిబ్యునల్ ప్రకటించిందన్నారు. ఇందులో 290 టిఎంసిలు కర్నాటకకు, 126 టిఎంసిలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించి నీటిని వినియోగించుకుంటున్నాయని అన్నారు. కర్నాటక రాష్ట్రం తనకు కేటాయించిన 290 టిఎంసిలను ప్రాజెక్టులు నిర్మించి ఇప్పటికే పూర్తిస్థాయిలో వినియోగించుకుంటోందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన నికర జలాలు ఆధారంగా రాయలసీమకు ఉపయోగపడే విధంగా 29.50 టిఎంసిల సామర్థ్యంతో తుంగభద్రలో లో లెవెల్ కెనాల్ (ఎల్ఎల్‌సి) 32.50 టిఎంసిల సామర్థ్యంతో తుంగభద్ర హై లెవెల్ కెనాల్ (హెచ్ఎల్‌సి), 39.90 టిఎంసిలతో కెసి కెనాల్ ప్రాజెక్టులు నిర్మించబడ్డాయన్నారు. మూడు ప్రాజెక్టుల కింద దాదాపు 8 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. ఇప్పటికే పై ప్రాజెక్టులకు కేటాయించిన మేరకు నీరు అందడం లేదన్నారు. 126 టిఎంసిలకు గాను 2018-19లో 43 టిఎంసిలు, 2019-20లో 35 టిఎంసిలు, 2020-21లో 53 టిఎంసిల నీరు మాత్రమే వచ్చిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నికర జలాల కేటాయింపు లేకుండానే కర్నాటక ప్రభుత్వం 29.50 టిఎంసిల సామర్థ్యంతో 6 లక్షల ఎకరాలకు నీరందించే విధంగా ఎగువ భద్ర ఎత్తిపోతల ప్రాజెక్టును నిర్మిస్తోందన్నారు. ఈ సంవత్సరం కర్నాటక రాష్ట్రంలో జరగబోవు అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దీనిని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి 2023-24 కేంద్ర బడ్జెట్‌లో రూ.5300 కోట్లు కేటాయించిందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే దిగువ రాయలసీమలో ఉన్న ఎల్ఎల్‌సి, హెచ్ఎల్‌సి, కెసి కెనాల్ ప్రాజెక్టులకు చుక్కనీరు కూడా రాదన్నారు. రాయలసీమ ఎడారి అవుతుందన్నారు. సీమలో సాగునీటికే కాక తాగునీటికి కూడా ఇబ్బంది కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీమకు ఇంత నష్టం జరుగుతుంటే సీమవాసి అయిన ముఖ్యమంత్రి జగన్ నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం దురదృష్టకరం అన్నారు. ఇప్పటికైనా సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేసి, సమర్థ వాదనలు వినిపించి ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలుపుదల చేయించాలని వైసిపి ప్రభుత్వానికి సూచించారు. లేకపోతే జగన్ సీమ ద్రోహిగా చరిత్రలో నిలిచిపోతారన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో సీమ ప్రజలు జగన్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి

రూ.6 లక్షల వరకు వ్యవసాయ రుణాలు మాఫీ

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.6 లక్షల వరకు వ్యవసాయ రుణాల మాఫీ చేస్తామని నర్రెడ్డి తులసిరెడ్డి పేర్కొన్నారు. తాడపత్రిలో ఆయన మీడియా మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 6 సూత్రాల కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. సీమాంధ్ర స్వర్ణాంధ్ర అవుతుందని చెప్పారు. రైతులు ఆత్మహత్యల్లో జాతీయస్థాయిలో ఆంధ్రప్రదేశ్ 3వ స్థానంలో ఉందన్నారు. రైతులను అప్పుల ఊబి నుండి బయటకు తెచ్చేటందుకు వ్యవసాయ రుణాలను రూ.6 లక్షల వరకు మాఫీ చేయాలని, రూ.500 లకే వంట గ్యాస్ సిలిండర్‌ను సరఫరా చేయాలని కాంగ్రెస్ నిర్ణయించిందని తెలిపారు.



మృతుడు జమ్మన్న

కుల ధ్రువీకరణ పత్రం విషయంలో ఘర్షణ

రెండు గ్రూపుల మధ్య విభేదాలు
ఒకరు మృతి, నలుగురికి గాయాలు, గుత్తిలో ఉద్రిక్తత

ప్రజాశక్తి-గుత్తి

కుల ధ్రువీకరణ పత్రం మంజూరు విషయంలో గుత్తి పట్టణంలోని జంగాల కాలనీలో శనివారం ఘర్షణ చోటుచేసుకుంది. తహశీల్దారు ఎస్.మహబూబ్ బాషా సమక్షంలో జరిగిన ఇరువర్గాల ఘర్షణలో ఒకరు మృతి చెందగా నలుగురుకి తీవ్ర గాయాలయ్యాయి. బాలసంతు కుల ధ్రువీకరణ పత్రం మంజూరుకు సంబంధించి తహశీల్దార్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సందీప్‌తో కలిసి జంగాల కాలనీకి విచారణకు వెళ్లారు. రెవెన్యూ అధికారులు విచారణ చేస్తుండగా ఇరు వర్గాలకు చెందిన జంగాల కులస్తులు ఘర్షణ పడ్డారు. ఒకరినొకరు కర్రలతో బాదుకున్నారు. ఇందులో ఒకరు తమను ఎస్సీ జాబితాలో చేర్చాలని, మరొకరు బీసీ-ఎ జాబితాలో చేర్చాలని గొడవపడ్డారు. ఈ ఘర్షణలో జమ్మన్న (55) మృతి చెందాడు. ఆశ్వ పెద్ద మారెన్న, అశ్వ చిన్న మారెన్న, కుల్లాయమ్మ, దేవా తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం వారిని అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. సంఘటనా స్థలాన్ని సిఐ ఎం. వెంకటరామిరెడ్డి పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

ఉరవకొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక తీసుకొచ్చిన జొన్నల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి నీలమయ్య సూచించారు. శనివారం మండల పరిధిలోని పాల్తూరు గ్రామంలో మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య, తహశీల్దార్ బ్రహ్మయ్య అధ్వర్యంలో రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం పాల్తూరుకు చెందిన రైతు నందీష్ ఇంటికి వెళ్లి జొన్న విత్తనాలను పరిశీలించారు. అదేవిధంగా అదేగ్రామానికి చెందిన గొర్ల మారయ్య పొలంలో ఉన్న జొన్నకంకులను పరిశీలించి సూచనలు, సలహాలను ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన విధంగా క్వింటాకు రూ.2,990 మద్దతు ధరతో రైతుల నుంచి పంటలు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కావున జొన్నపంట సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఆయా రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ గోవిందరెడ్డి, ఎంపిఇఒలు మెర్సీ, ముత్యాలు, సహకార సొసైటీ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలను సక్రమంగా వినియోగించాలి

ఉరవకొండ : వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా వినియోగించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి ఎం.శ్రీనివాసులు సూచించారు. శనివారం రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని మూలగిరిపల్లి, రాకెట్ల తండా గ్రామాల్లో చేపట్టిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో నిర్వహించాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పించారు. వ్యాక్సిన్లు సరైన ఉష్ణోగ్రతల వద్ద నిల్వ చేస్తున్నారా.. రికార్డులు సరిగా నిర్వహిస్తున్నారా.. అనే విషయాలపై ఆరాతీశారు. చిన్న చిన్న లోపాలు ఉంటే వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ ఎస్ఎంఎస్ షఫీ, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్‌మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

గ్యాస్ బండ మోయలేం : సిపిఎం

ప్రజాశక్తి-గుత్తి

కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు వి.నిర్మల, మండల కార్యదర్శి బి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు వంట గ్యాస్ ధరను పెంచడాన్ని నిరసిస్తూ శనివారం సిపిఎం ఆధ్వర్యంలో గుత్తిలో నిరసన తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక ఆర్అండ్‌బి నుంచి గ్యాస్ సిలిండర్లతో నాయకులు ర్యాలీగా గాంధీ కూడలికి చేరుకుని ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి ఎన్.రేణుక, నాయకురాలు కవిత, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

బిసి వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి

ప్రజాశక్తి-తాడిపత్రి

వసతిగృహాల్లోని విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బిసి వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారి సూచించారు. బీసీ వెల్ఫేర్ డైరెక్టర్,కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని అబ్దుల్‌కలాం షాదీఖానాలో బీసీ హాస్టళ్లలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. అంతేగాకుండా పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణతో చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. అనంతరం క్రియేటర్ క్రిష్ణ పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావాలి అన్న అంశంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్ (అట్ట)లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి ఎబిసి డబ్ల్యుఒ రంగమ్మ, డివిజన్ పరిధిలోని బీసీ హాస్టల్ వార్డెన్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికశక్తిగా భారతదేశం :జెఎన్‌టియు విసి

అనంతపురం : రాబోయే కాలంలో ఆర్థికశక్తిగా భారతదేశం ఎదగడానికి అవకాశం ఉందని జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం మహారాష్ట్రలోని నాగపూర్ ప్రియదర్శినీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఐఎస్‌టిఇ జాతీయ వార్షిక విద్యార్థుల సదస్సులో రాష్ట్ర ఐఎస్‌టిఇ అధ్యక్షుడు హోదాలో హాజరైన ఆయన మాట్లాడుతూ సాంకేతిక ఆవిష్కరణలు, స్థిరమైన అభివృద్ధి అనే అంశంపై సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థి వారి ఆలోచనలను ఉత్పత్తి రూపంలో తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా తీర్చిదిద్దాలన్నారు. అప్పుడే భారతదేశం ఆర్థికంగా శక్తివంతంగా ఎదుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపి ఐఎస్‌టిఇ కార్యదర్శి బి.ఈశ్వర్‌రెడ్డి, జాతీయ అధ్యక్షుడు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ఆదర్శంగా నిలవాలి

అనంతపురం కలెక్టరేట్ : మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించి ఆదర్శంగా నిలవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శనివారం కుందుర్పి మండల కేంద్రంలో ఎస్‌కె ఛారిటబుల్ ట్రస్టు, అభయ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్ శిక్షణా శిబిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిస్సెస్ ఇండియా టైటిల్ విజేత సుప్రజ, ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ హేమలత, ఎస్‌కె ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు, ప్రజా గాయకుడు ఎస్‌కె.లెనిన్ బాబు, ట్రస్టు నిర్వాహకులు రాజు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ దిలీప్ కుమార్, శిక్షకురాలు అంబుజా, ట్రస్టు సభ్యులు శ్రీకాంత్, ఉమాదేవి, యశోద, సావిత్రమ్మ, శిక్షణ పొందుతున్న మహిళలు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటు కళ్యాణదుర్గం వాసులకు వరం

పారిశ్రామిక వేత్త జికె కృష్ణమూర్తి

కళ్యాణదుర్గం : అన్నిరంగాల్లో వెనుకబడ్డ కళ్యాణదుర్గం నియోజకవర్గ అభివృద్ధికి పరిశ్రమల ఏర్పాటు గొప్ప వరమని పారిశ్రామిక వేత్త జికె కృష్ణమూర్తి తెలిపారు. శనివారం విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కళ్యాణదుర్గం ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు పోస్‌పోల్ కంపెనీ ప్రతినిధులు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఇదివరకే నూతిమడుగు, తిప్పేపల్లి, కర్తనపర్తి, గూళ్యం, తిమ్మసముద్రం, గోళ్ల తదితర ప్రాంతాల్లో కంపెనీ ప్రతినిధునులు ప్రత్యేక సర్వే నిర్వహించి భూసేకరణ చేసినట్లు వివరించారు. ఈనేపథ్యంలో రూ.275కోట్ల పెట్టుబడులు వెచ్చించేందుకు ఆ కంపెనీ సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు.

వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన

బొమ్మనహాల్ : మండలంలోని కురువల్లి గ్రామంలో వాల్మీకులు వాల్మీకి విగ్రహాన్ని శనివారం ఘనంగా ప్రతిష్టించారు. ఇందులో భాగంగా ఉదయం 6 గంటల నుంచి వేద పండితుల వేదమంత్రాలతో ప్రత్యేక హోమం, అర్చనలు చేశారు. అనంతరం వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో విప్ కాపు రామచంద్రారెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు, వాల్మీకి సంఘం మండల కమిటీ నాయకులు అధ్యక్షులు వన్నప్ప, ఉపాధ్యక్షులు దేవన్న, సింగేపల్లి గౌరవాధ్యక్షులు లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ భద్రతా వారోత్సవాలు

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని తలారిచెరువు గ్రామ సమీపంలో ఉన్న పెన్నా సిమెంట్ కర్మాగారంలో శనివారం 52వ జాతీయ భద్రతా వారోత్సవాలు నిర్వహించినట్లు సీనియర్ జనరల్ మేనేజర్ పీవీ కృష్ణయ్యాయాదవ్ తెలిపారు. ఇందులో భాగంగా భద్రతా పతాకాన్ని ఆవిష్కరించి ఉద్యోగులు, కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో భాగంగా ప్రతి ఒక్కరూ పరిశ్రమలో భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రమాద రహిత కర్మాగారంగా కొనసాగడానికి భద్రతా ప్రమాణాలను బలోపేతం చేయాలని కోరారు. అనంతరం భద్రతా నియమాలపై విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఉన్నత ఉద్యోగులు, పరిశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

జెఎన్‌టియు పరిధిలో పరీక్షలు వాయిదా

అనంతపురం : ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా అనంతపురం జెఎన్‌టియు పరిధిలో ఈనెల 13వ తేదీ సోమవారం నిర్వహించాల్సిన ఎంబిఎ 2వ సెమిస్టర్, ఎంసిఎ 2వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలను వాయిదా వేసినట్లు పరీక్షల విభాగం డైరెక్టర్ ఇ.కేశవరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలను ఈనెల 14న మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మార్పును ప్రిన్సిపాళ్లు గమనించాలని కోరారు.

సామాన్యుల గొంతుకగా పిడిఎఫ్ అభ్యర్థులు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థులంటే సామాన్య గొంతుక అని చెప్పాలి. మండలి ఎన్నిల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి పట్టభద్రుల, ఉపాధ్యాయ మండలి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులు పనితీరు ఇందుకు నిదర్శనం. రాయలసీమ పశ్చిమ పట్టభద్రుల నియోజకవర్గంలోనూ ఇదే రకమైన ఒరవడిని పిడిఎఫ్ అభ్యర్థులు కనబరుస్తూ వస్తున్నారు. ధన, అధికార బలాన్ని ఎదుర్కొని విజయం సాధించడమే కాకుండా పదవీ కాలమంతా సామాన్య ప్రజల సమస్యలపై గొంతెత్తేవారిగా ఉంటూ వస్తున్నారు. ఇప్పుడు కూడా రాయలసీమ పశ్చిమ నియోజకవర్గానికి జరుగుతున్న ఎన్నికలకు పిడిఎఫ్ అభ్యర్థులు బరిలో నిలిచారు. పట్టభద్రులకు పోతుల నాగరాజు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి కత్తి నరసింహారెడ్డిలు నామినేషన్ల దాఖలు చేసియున్నారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణలు కూడా మగిశాయి. ప్రచారాలు ఊపందుకున్నాయి. మొత్తం 49 మంది అభ్యర్థులు పట్టభద్రుల బరిలో నిలిచారు. 12 మంది ఉపాధ్యాయ నియోజకవర్గానికి పోటీలలోనున్నారు. పట్టభద్రుల నియోజకవర్గానికి వచ్చినప్పుడు చాలా మంది అధికారపార్టీకి డమ్మీలగా బరిలో ఉన్నట్టు విమర్శలున్నాయి. అదనంగాఆ ఏజెంట్లు, వాహనాల కోసం కొంత మందిని నామ మాత్రపు బరిలో నిలిపి ఎన్నికల సమయంలో వారి మనుషులను అదనపు ఏజెంట్లుగా పంపి లబ్ధిపొందాలన్న యోచనతోనే కొంత మందిని డమ్మీ అభ్యర్థులను బరిలో నిలిపారు. ఇది ఇలాగుంటే నామినేషన్ల ప్రక్రియ మొత్తం పూరవడంతో ఇప్పుడు ప్రచారాల హోరారు మొదలైంది. అటు అధికారి, ఇటు ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులతోపాటు, పిడిఎఫ్ అభ్యర్థులూ ప్రచారాలు జోరుగా సాగిస్తున్నారు. వైసిపి అభ్యర్థి తరుపున ఎమ్మెల్యేలు, మంత్రులు పెద్దఎత్తున ప్రచారాలు చేస్తుండగా,టిడిపి అభ్యర్థుల తరుపున నియోజకవర్గ నాయకులు ప్రచారాలు చేస్తున్నారు. పిడిఎఫ్ అభ్యర్థుల తరుపున కార్మిక సంఘాలతోపాటు, ఉద్యోగ, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు పెద్దఎత్తున ప్రచారాం చేస్తున్నారు. గ్రామ గ్రామాన కూడా కార్మికులు సైతం పిడిఎఫ్ అబ్యర్థుల తరుపున ప్రచారం చేస్తున్నారు. దీనికితోడు ఇప్పటికే కాంగ్రెసు,జనసేన పార్టీలు మద్దతు ప్రకటించాయి. రోజురోజుకు మద్దతు పెరుగుతోంది. ఇదే సమయంలో రాయలసీమ ప్రాంతంలోని అనేక సమస్యలను చర్చకొచ్చే విధంగా పిడిఎఫ్ అభ్యర్థులు గళమెత్తుతున్నాయి. గతంలోనూ ఈ సమస్యలపై పిడిఎఫ్ అభ్యర్థులు పోరాటాలు చేసిన దాఖలాలున్నాయి. పెరుగుతున్న మద్దతును చూసి ఏదోక రకంగా అధికార, ధన బలంతో గెలుపొందేందుకు అధికార వైసిపి ప్రయత్నాలను ఇప్పటి నుంచే ఆరంభించిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధ్యాయ ఓటర్లను ప్రలోభ పెట్టే ప్రక్రియ అప్పుడు ప్రారంభించినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ప్రధానంగా ప్రయివేటు టీచర్లకు గాలమెసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. దీనికి ధీటుగా ప్రజలన సమీకరించేందుకు పిడిఎఫ్ మద్దతుదారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజా సమస్యలపై గళమెత్తే వారిని మండలికి పంపించాలన్న కృతనిశ్చయంతో కార్మికులు, ఉద్యోగులు పిడిఎఫ్‌కు మద్దతుగా ప్రచారాలు చేస్తున్నారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం ముమ్మరం

ప్రజాశక్తి-శింగనమల

పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రచారం ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు సూర్యప్రకాష్, తరిమెల గిరి మండల అధ్యక్షులు గంగాధర్ మాట్లాడుతూ ప్రజా గొంతుకలను అణచివేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న ప్రస్తుత సమయంలో ప్రశ్నించే గొంతుకలు, ప్రజా పోరాట నాయకులను చట్టసభలకు పంపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ ఎన్నికల్లో పిడిఎఫ్ బలపరుస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అభ్యర్థులకు ప్రజా పోరాటాల్లో సుదీర్ఘ ప్రయాణం ఉందన్నారు. ముఖ్యంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు తన ప్రభుత్వ ఉద్యోగాన్ని సైతం వదిలేసి ప్రజా సమస్యలపై, ప్రజావంతులుగా ప్రజల పక్షమే లక్ష్యంగా అనేక ఉద్యమాలను నిర్మించారన్నారు.

మరోవైపు టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కత్తి నరసింహారెడ్డి సైతం గతంలోనే ఎమ్మెల్సీగా ఉంటూ అనేకమైన ప్రజా సమస్యలు, ఉపాధ్యాయ సమస్యలను శాసనమండలిలో వినిపించారని గుర్తు చేశారు. కావున పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్, రఘు, ఓబులేసు, గణేష్, వర్ధన్, భాస్కర్, నరేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.



నార్పల మండలం నడిమిదొడ్డి గ్రామంలో ఓటర్లను అభ్యర్థిస్తున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, నాయకులు

నార్పల : మండలంలోని నడిమిదొడ్డి గ్రామంలో పిడిఎఫ్ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఓటర్లను కలుసుకుని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, చేతి వృత్తిదారుల సంఘం నాయకుడు ప్రభాకర్, సిఐటియు నాయకులు రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : త్వరలో జరగనున్న శాసనమండలి ఎన్నికలలో పిడిఎఫ్ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించాలని సిఐటియు, ఎఐటియుసి నాయకులు కోరారు. శనివారం రాయదుర్గంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, ఎఐటియుసి పూర్వ నాయకులు నాగార్జున మాట్లాడుతూ పిడిఎఫ్ బలపరుస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు రమేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, ఎఐవైఎఫ్ తాలూకా కార్యదర్శి కోట్రేష్, నాయకులు అంజి, రైతుసంఘం నాయకులు నరసింహులు, దుర్గన్న, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని సిపిఎం, కాంగ్రెస్ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో శనివారం మండలంలో ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో పని చేస్తున్న సిబ్బందిని కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు సూరి, సిపిఎం మండల కార్యదర్శి డి.పెద్దయ్య, ఓపిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఒబిసి ఛైర్మన్ రామ్‌చరణ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ రకాల నమూనాలు

ఎలైట్ పాఠశాలలో విజ్ఞాన ప్రదర్శన

అనంతపురం : నగరంలోని ఎలైట్ ఇంగ్లీష్‌మీడియం పాఠశాలలో శనివారం సైన్స్‌ఫైర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ నాజీర్‌హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు విజ్ఞానం, సాంకేతిక అవగాహన ఎంతో అవసరమన్నారు. వీటిపై అవగాహన కల్పించేందుకే సాహిత్య, విజ్ఞాన ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

పెద్దపప్పూరు : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాలు మేరకు శనివారం మండల కేంద్రంలోని నర్సింగ్ హోమ్‌లను తనిఖీ చేసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా అరవింద, శారదా నర్సింగ్‌హోమ్‌లను తనిఖీ చేసి స్కానింగ్ కేంద్రాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, స్కానింగ్ చేయించుకున్న వారి వివరాలను ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భస్థ పిండ పరీక్ష, నియంత్రణ, దుర్వినియోగ నివారణ చట్టం-1994 ఆదేశాల మేరకు ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే గర్భస్థ పిండ పరీక్ష, నియంత్రణ, దుర్వినియోగ నివారణ చట్టం-1994 సంబంధించి వివరాలు తెలిపే బోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు.

విద్యతోపాటు విజ్ఞానం అవసరం

ప్రజాశక్తి-శింగనమల

విద్యనే పరమావధిగా భావిస్తున్న నేటి తరుణంలో విజ్ఞానం, వినోదం, పోటీతత్వం అందిస్తూ విద్యార్థులను తీర్చిదుద్దుతున్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ జిల్లాలోనే ఓ ప్రత్యేకతను సంతరించుకుందని రాష్ట్ర టెన్నిస్ అకాడమీ ప్రెసిడెంట్ భానుప్రకాష్ తెలిపారు. శనివారం స్థానిక గుత్తి రోడ్డులోని లోలూరు క్రాస్ వద్ద ఉన్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ 6వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థుల తల్లిదండ్రులు విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. వీటిద్వారా విద్యలో పోటీతత్వం పెరుగుతున్నా విజ్ఞానం, వినోదంలో ఉన్న ప్రాముఖ్యతను గుర్తించలేకపోతున్నారన్నారు. నేటి బాలలు రేపటి పౌరులుగా మెలగాలంటే విద్య ఒక్కటే కాదు.. వినోదం, సాంస్కృతిక విభాగాలు కూడా విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి ఉపయోగపడతాయన్నారు. రానున్న రోజుల్లో వీటిపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. సామాజిక కార్యకర్త లెనిన్‌బాబు మాట్లాడుతూ పలు రకాల కార్యక్రమాల కలయికలతో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విరాజిల్లుతోందన్నారు. ఈతరుణంలోనే ఇక్కడ విద్యార్థులు విద్యనభ్యసించడానికి ఉత్సాహం చూపుతున్నారన్నారు. అంతేగాకుండా పాఠశాల యాజమాన్యం పిల్లల చదువు పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రోత్సహించడం సంతోషకరమన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసులు, సిఇఒ ప్రతాప్‌రెడ్డి, జిఎం రామసుబ్బారెడ్డి, ఎజిఎం శంకరనారాయణ, ప్రిన్సిపాల్ ఫైజాన్‌బాను, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్ర టెన్నిస్ అకాడమీ ప్రెసిడెంట్ భానుప్రకాష్ ఘనంగా హెచ్‌పిఎస్ వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

రైతు బిడ్డను కాబట్టే కష్టాలు తెలుసు.. : ఎమ్మెల్యే పెద్దారెడ్డి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

'నేను రైతు బిడ్డను.. కాబట్టే రైతుల కష్టాలు నాకు తెలుసు.. రైతులను కష్టాల నుంచి గట్టెక్కించాలని ఆలోచించి నేను అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రాజెక్టులకు నీరు తీసుకొచ్చా..' అంటూ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని కొట్టాలపల్లి, పసులూరు, గార్లదిన్నె మీదుగా బొందలదిన్నె వరకూ ప్రజా సంక్షేమ పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా పసులూరు గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రైతు అహర్నిశలు కష్టపడి వేసిన పంట చేతికి వచ్చేసరికి పెట్టుబడి రాకపోగా.. వర్షాలు సరిగా కురువక భూగర్భజలాల అడుగంటిపోయి బోర్లలో నీరు ఇంకిపోతే పరిస్థితి ఎలా ఉంటుందో.. తాను కళ్లారా చూశానన్నారు. అంతేగాకుండా ఎమ్మెల్యే కాకముందు కూడా ఇక్కడ పాదయాత్ర చేశానని, అప్పుడు రైతులు సాగునీటి కోసం తీవ్రంగా ఇబ్బందులు పడటం చూశానన్నారు. అందుకోసమే తాను ఎమ్మెల్యే గెలిచాక పెండేకల్లు, చాగల్లు రిజర్వాయర్లకు నీళ్ల తీసుకొచ్చానన్నారు. ప్రస్తుతం మండలవ్యాప్తంగా ఎక్కడ చూసినా భూగర్భజలాలు పైకి వచ్చాయన్నారు. దీంతో రైతులు, ప్రజలకు కూడా సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. ఇకపోతే సిఎం జగన్ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ఎవరికైనా ఏ పథకమైనా రాకుంటే ఎవరికీ భయపడకుండా నేరుగా వాలంటీర్లు, సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. కావున మరోసారి జగన్‌ను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వేమనాథ్‌రెడ్డి, ఎంపిపి రామ్మూర్తిరెడ్డి, జడ్పిటిసి రమాదేవి, వైస్ ఎంపిపి బొందలదిన్నె రామిరెడ్డి, పార్లమెంటరీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డి, బొందలదిన్నె రాఘవరెడ్డి, రాంబాబు, పురుషోత్తం, కమలాకర్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డిచ రామచంద్రారెడ్డి, నారాయణస్వామి దేవస్థానం ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, ముచ్చుకోట అమర్నాథ్‌రెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, తురకపల్లి లక్ష్మీరెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి

జిల్లా వ్యవసాయ అధికారి మద్దిలేటి

బుక్కరాయసముద్రం : పంటలు సాగు చేసే రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి పొందేందుకు కృషి చేయాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని దయ్యాలకుంటపల్లి గ్రామంలో పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఇందులో భాగంగా రైతు సత్యనారాయణరెడ్డి సాగు చేసిన పొలంలో పంటకోత ప్రయోగం నిర్వహించగా దిగుబడి బాగా రావడంతో రైతును అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించాలని కోరారు. ఎడిఎ వెంకటరాముడు మాట్లాడుతూ 14 వారాలుగా జిల్లా వ్యవసాయధికారి చంద్రానాయక్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ శైలజ, ఎరువాక శాస్త్రవేత్త కిషోర్, వ్యవసాయాధికారులు శంకర్‌లాల్, ప్రవీణ్, రుమానాబేగం, శ్రీనివాసులు, మండల వ్యవసాయాధికారి శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపిటిసి శివారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కష్టపడితే భవిష్యత్తు మీదే..

పుట్లూరు : కష్టపడి పని చేస్తే భవిష్యత్ మీదేనని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కార్యకర్తలకు సూచించారు. శనివారం మండలంలోని బాలాపురం గ్రామంలో నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు అలం నరసానాయుడు అధ్వర్యంలో ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం ఒక దుర్మార్గుడుతో పోటీ పడుతున్నామన్నారు. ప్రతి కార్యకర్త కష్టపడాలన్నారు. ఇప్పుడు కష్టపడితే మనదే భవిష్య త్తు అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుదర్శన్‌నాయుడు, రవిచంద్రనా యుడు, శివశంకర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, రామాంజినేయులు, కడవకల్లు గోవర్ధన్‌రాజు, ఓబుళనాయుడు, రామాంజి, భాస్కర్‌నాయు డు, చంద్రశేఖర్‌నాయుడు, సోమశేఖర్ నాయుడు నరసింహ, శ్రీనివాసులురెడ్డి, నాగ సుబ్బారాయుడు, శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

పెద్దవడుగూరు : మండలంలోని కాశేపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి ఆటో బోల్తా పడిన ఘటనలో నరేంద్రాచారి (28) మృతిచెందినట్లు ఎస్ఐ రాజశేఖరరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గుత్తికి చెందిన నరేంద్రాచారి సొంత పని నిమిత్తం అనంతపురానికి ఆటోలో వెళ్లి తిరిగి వస్తుండగా కాశేపల్లి వద్ద జాతీయ రహదారిపై బోల్తాపడింది. దీంతో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని చికిత్స కోసం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య దుర్గాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

యాడికి : మనోవేదనకు గురైన ఓ మహిళ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మండల కేంద్రంలోని అంకాలమ్మ వీధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాడికిలోని అంకాలమ్మ వీధిలో నాగేష్, పావని (31) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. అయితే నాగేష్ కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ పనులకు వెళ్లే వాడు కాదు. ఇలాగైతే కుటుంబాన్ని పోషించుకోవడం ఎలా అని పావని మనోవేదనకు గురయ్యేది. ఈ మనోవేదనతోనే కొన్ని నెలల క్రితం విష ద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అయితే వెంటనే ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. ఈనేపథ్యంలో కుటుంబ పోషణ భారమై మానసిక క్షోభతో శనివారం ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పునకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన బంధువులు వెంటనే స్థానిక ప్రయివేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్‌కెయు రీసెర్చ్ స్కాలర్ ఆత్మహత్యాయత్నం

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం గణిత శాస్త్ర పరిశోధక విద్యార్థి అంజి శనివారం వసతిగృహంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇటుకలపల్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రామగిరి మండలం శేషానుపల్లికి చెందిన అంజి ఎస్‌కెయు గణిత విభాగంలో పరిశోధన విద్యను అభ్యసిస్తూ వసతి గృహంలో ఉంటున్నాడు. ఈనేపథ్యంలో వసతి గృహంలో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అంజిని తోటి విద్యార్థులు హుటాహుటిన అంబులెన్సులో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు ప్రయివేట్ అస్పత్రికి తరలించారు. ఆర్థిక సమస్యలతోపాటు ఉద్యోగం రాలేదన్న నిరాశతో ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు బంధవులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇటుకలపల్లి పోలీసులు తెలిపారు.

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి : సిపిఎం

గార్లదిన్నె : మండల పరిధిలోని కల్లూరు అగ్రహారం సర్వేనెంబర్ 259లో పేదలు ఆక్రమించిన ఇళ్లస్థలాలకు పట్టాలు పంపిణీ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు పేదలు వేసుకున్న గుడిసెలను సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఇళ్లులేని నిరుపేదలు కల్లూరు సమీపంలో ఉన్న పుష్పగిరి దేవుని మాన్యంలో గుడిసెలు వేసుకున్నారన్నారు. అయితే ఈ స్థలాన్ని అధికార పార్టీ నాయకులు ఆక్రమించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కావున వెంటనే ఆ భూమిని పరిరక్షించి పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, నాగమ్మ, నాగార్జున, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని వినతి

అనంతపురం : ప్రమాదాల నివారణ, నియంత్రణకు చర్యలు చేపట్టాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ (ఎన్ఎస్‌హెచ్ఆర్) తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు సాయితేజ కొండిశెట్టి కోరారు. ఈమేరకు శనివారం నగరంలోని ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో డిటిసి శివరామప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సాయితేజ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ కోసం కాలుష్య సర్టిఫికెట్ల జారీ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అంతేకాకుండా మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవనే నినాదంతో పోస్టర్లు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ అడ్వైజర్ ఓబుళపతి, జిల్లా ఇన్‌ఛార్జిలు మాకే హరీష్, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి శనివారం స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ కర్నూలు నగరానికి చెందిన ఇల్లూరు సాయికృష్ణ, ప్రత్యూష దంపతుల కూతురు పుట్టిన సందర్భంగా పేదలకు అన్నదానం చేపట్టినట్లు తెలిపారు. మన ఇళ్లల్లో జరిగే శుభకార్యాలకు పేదల ఆకలి తీరుస్తే ఎంతో సంతృప్తి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుధారాణి, హర్ష, సుబ్రహ్మణ్యం, ఓబుళపతి, సుబ్బారావు, చంద్రశేఖర, కిష్టప్ప, నల్లప్ప, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

అనంతపురం సిటీ : మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో 2023-24లో 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రభుత్వం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఐదు బిసి గురుకుల పాఠశాలల్లో 120 బాలికలు, 120 బాలుర సీట్లు భర్తీ చేయన్నుట్లు తెలిపింది. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపింది.

దినసరి సంత వేలంపాట

అనంతపురం కార్పొరేషన్ : కార్పొరేషన్ పరిధిలో ఉన్న దినసరి సంత మార్కెట్ సుంకం ఏడాది పాటు వసూలుకు శనివారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. ఈపాటలో కాంట్రాక్టర్ విజయకుమార్ రూ.76,60,000కు పాట పాడి టెండర్ దక్కించుకున్నారు. సర్కార్ సవాల్ రూ.75 లక్షలకు ఖరారు చేశారు. ఈనేపథ్యంలో కాంట్రాక్టర్లు మొక్కుబడిగా ధరను కొంతమేరకు పెంచారు. పలుమార్లు అధికారులు విజ్ఞప్తి చేసినా ధర పెంపునకు ఎవరూ ఆసక్తి చూపలేదు. దీంతో విజయ్ కుమార్‌కు టెండరు కట్టబెట్టారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్లు సతీష్‌కుమార్, సుజాత, సూపరింటెండెంట్ వేణుగోపాల్‌రెడ్డి, కాంట్రాక్టర్లు గడ్డం కుమార్, శ్రీనివాసులు, విజయకుమార్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు, గుమాస్తాలు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

ఆత్మకూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను డిఇఒ సాయిరాం శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా 8వ తరగతి విద్యార్థులతో ట్యాబ్ ద్వారా కాస్ట్ క్లాసులను వివరించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనం విషయంలో ఏమాత్రం లోటుపాటు లేకుండా చూడాలని హెచ్ఎం రాఘవయ్యను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు పాల్గొన్నారు.

విద్యార్థులు పరీక్షలకు ధైర్యంగా సిద్ధం కావాలి

అనంతపురం : విద్యార్థులు ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని శ్రీచైతన్య విద్యాసంస్థల ఎజిఎం సుబ్బారెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఉన్న శ్రీచైతన్య విద్యాసంస్థలో సరస్వతి పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మవిశ్వాసంతో సంకల్ప సిద్ధి చేకూర్చుకోవాలన్నారు. ముఖ్యంగా పట్టుదల, ఆత్మవిశ్వాసంతో సహజ ఒడిదుడుకులను ఎదుర్కొని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ ప్రయత్నంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించాలంటే చిన్నారులు మానసిక ప్రశాంతతతో ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలను ఆహూతులను ఆకట్టుకున్నాయి. తర్వాత ఏర్పాటు చేసిన చిన్నారుల వీడ్కోలు కార్యక్రమంలో తల్లిదండ్రులు తమ అమూల్యమైన సందేశాలను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు సమీనాఖాన్, విశ్వనాథ్, ఖలందర్, వెంకటేష్, తబసుం, శ్రీదేవి, స్వరూప, శాంతా, పర్వీన్, నేత్రావతి, అకాడమీ కోఆర్డినేటర్లు రాధాకృష్ణ, శ్రీనివాస్, తిరుమలేష్, జోనల్ ప్రైమరీ ఇన్‌ఛార్జి లత, పూజ, వైస్ ప్రిన్సిపల్ షమీనా, డీన్ సత్యనారాయణ, ఇన్‌ఛార్జి చంద్రమోహన్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.